క్లుప్తంగా

గజ వాహనంపై చాముండేశ్వరిదేవి



ఇందుకూరుపేట: ప్రముఖ పుణ్యక్షేత్రమైన గంగపట్నం చాముండేశ్వరిదేవి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారు గజ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి ఉత్సవమూర్తిని గజ వాహనంపై కొలువుదీర్చి వివిధ రకాల పుష్పాలతో శోభాయమానంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులకు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

కోవూరు: మండలంలోని పడుగుపాడులోని క్రీడా మైదానం సమీపంలో సుమారు 60 ఏళ్ల కలిగిన గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు ఆదివారం గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై దాసరి వెంకటేశ్వరరావు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి శరీరంపై ఎలాంటి దుస్తులు లేకపోవడంతో వస్త్రాలు కప్పి మృతదేహాన్ని కోవూరు వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వీరభద్రస్వామికి శఠారి బహూకరణ

మనుబోలు: స్థానిక భద్రకాళి సమేత వీరభద్రస్వామికి చీమకుర్తి సుబ్బమ్మ జ్ఞాపకార్థంగా మనుమలు గాదంశెట్టి గంగాధర్, లక్ష్మి ఆదివారం శఠారిని బహూకరించారు. ఆలయ వార్షికోత్సవాల్లో అర్చకులు శ్రీనివాసులుకు శఠారిని అందజేశారు. ఈ సందర్భంగా పంచామృతాభిషేకం, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం నిర్వహించి శఠారిని స్వామికి అలంకరించారు.

గేదెల అపహరణపై ఫిర్యాదు

వెంకటాచలం: తమ గేదెలను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకెళ్లారని కనుపూరు గ్రామానికి చెందిన వల్లూరు రమేష్‌నాయుడు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ నెల 24న తన 20 గేదెలను కాపలాదారుడైన మానికల పెంచలయ్య కనుపూరు చెరువు వద్దకు మేతకు తోలుకెళ్లాడని చెప్పారు. మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వచ్చి వెళ్లేలోగా ఏడు గేదెలు కనిపించలేదన్నారు. చుట్టుపక్కల ఎంత వెతికినా కనిపించలేదని ఫిర్యాదు చేశారు. గేదెలు విలువ సుమారు రూ.3.50 లక్షలు ఉంటుందని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గోశాలలో ప్రత్యేక పూజలు

బుచ్చిరెడ్డిపాళెం: జొన్నవాడలో కొలువైన మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి అమ్మవారి ఆలయానికి అనుసంధానంగా ఉన్న గోశాలలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోవులకు ఆహారాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకుని గోశాలలోని గోవులకు అవసరమైన వసతులను కల్పించామన్నారు. గోవుల సౌకర్యార్థం రాళ్లను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓ వెంకటేశ్వర్లు, అర్చకులు పాల్గొన్నారు.

వేసవి శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కొడవలూరు: గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని రిసోర్స్‌పర్సన్ వీ రమేష్ సూచించారు. మండలంలోని యల్లాయపాళెం గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం విద్యార్థులతో కథలు చెప్పించడం, చదివించడం చేసి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రిసోర్స్‌పర్సన్ మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరానికి వస్తున్న చిన్నారులను ప్రోత్సహించేందుకు గ్రామానికి చెందిన దాత పీ రంగారెడ్డి సొంత నిధులతో బహుమతులు అందజేయడం అభినందనీయమన్నారు. తల్లిదండ్రులు పిల్లలు ఎండల్లో తిరగకుండా వేసవి శిబిరానికి పంపేలా చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ జే సురేంద్రరెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగ శిక్షణ కేంద్రానికి రూ.25 వేల విరాళం

కొడవలూరు: మండలంలోని రామన్నపాళెంలోని ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాల భవనంలో తురకా కాంతమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉద్యోగ శిక్షణా కేంద్రానికి సంఘ సేవకులు కాంద్ర సతీష్‌నాయుడు రూ.25 వేలు విరాళాన్ని ఇచ్చారు. యువ నేస్తం సభ్యుడు బాపట్ల వెంకటపతి చేతుల మీదుగా కేంద్రం నిర్వాహకుడు తురకా వెంకటరమణకు ఆదివారం నగదును అందజేశారు. సతీష్‌నాయుడు సేవా కార్యక్రమాల్లో ముందుంటారన్నారు ఉద్యోగ శిక్షణా కేంద్రానికి విరాళాన్ని అందించడం ఆయన సేవా భావానికి నిదర్శనమన్నారు.

నగరం.. పరిశుభ్రం

- పారిశుధ్యంపై నిరంతర పర్యవేక్షణ
- బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానా
- పకడ్బందీగా ఇంటింటి చెత్త సేకరణ



చెత్త సేకరణ వాహనం

నెల్లూరు(బారకాసు): స్వచ్ఛ సింహపురి సాకార దిశగా నగరపాలక సంస్థ అడుగులేస్తోంది. ఇంటింటి చెత్త సేకరణ.. కాలువలను శుభ్రపర్చడం.. బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేయకుండా చర్యలు చేపడుతూ లక్ష్యాన్ని సాధిస్తున్నారు. అధికారుల చర్యలతో ఫలితం కనిపిస్తోంది. నగరపాలక సంస్థ పరిధిలో 54 డివిజన్లు.. 167 సచివాలయాలున్నాయి. 149.89 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న నగరంలో 1,83,643 గృహాలున్నాయి. దాదాపు 8 లక్షలకుపైగా ప్రజలు నివసిస్తున్నారు.

ఇంటింటి చెత్త సేకరణ ఇలా..

నగరంలో చెత్త సేకరణకు 146 వాహనాలున్నాయి. ఇందులో మినీ వ్యాన్లు 128, బిగ్ కంపాక్టర్లు నాలుగు, స్మాల్ కంపాక్టర్లు 12, స్వీపింగ్ మెషీన్లు రెండున్నాయి. వీధులు, కాలువలను శుభ్రం చేసేందుకు 1506 మంది పారిశుధ్య కార్మికులు ఉన్నారు. వీరితో పాటు ఆరుగురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఏడుగురు హెల్త్ అసిస్టెంట్లు, 131 మంది వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలు, 26 మంది పబ్లిక్ హెల్త్ మేస్త్రీలున్నారు. మినీ వాహనాల ద్వారా ప్రతి ఇంట్లోని వ్యర్థాలను తడి, పొడి చెత్తగా వేర్వేరుగా సేకరిస్తున్నారు. ఈ చెత్తను మినీ వాహనాల ద్వారా డంపింగ్ యార్డుకు తరలిస్తారు. ఇలా రోజూ దాదాపు 300 టన్నుల చెత్తను సేకరిస్తున్నారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు నెలకు రూ.రెండు కోట్లకు పైగా వెచ్చిస్తున్నారు.

నిరంతర పర్యవేక్షణ

నగరంలో పారిశుధ్యాన్ని మెరుగుపర్చేందుకు గానూ తెల్లవారుజామునే కొన్ని ప్రాంతాల్లో కమిషనర్ వికాస్ మర్మత్ ఆకస్మిక తనిఖీలు చేస్తున్నారు. ఎవరైనా సిబ్బంది విధులకు ఆలస్యంగా వచ్చినా.. సమాచారం లేకుండా గైర్హాజరైనా నోటీసులు జారీ చేసి చర్యలు చేపడుతున్నారు. చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వేస్తే సంబంధిత వ్యక్తులకు నోటీసులను సైతం జారీ చేస్తున్నారు. దీంతో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు గృహ యజమానులు, దుకాణదారులు బాధ్యత వహిస్తున్నారు.

వీధులు శుభ్రంగా ఉంటున్నాయి



గతంతో పోలిస్తే పారిశుధ్యం చాలా వరకు మెరుగుపడింది. ఇలానే కొనసాగితే నగరం మరింత పరిశుభ్రమవుతుంది.

– హిమబిందు, బాలాజీనగర్

చెత్త సేకరణతో పాటు కాలువలనూ శుభ్రం చేస్తున్నారు



ఇంటింటి చెత్తను రోజూ సేకరిస్తున్నారు. మా వీధిలోని కాలువలను శుభ్రం చేస్తున్నారు. చిన్న వీధులే కాకుండా నగరంలోని ప్రధాన రహదారులూ పరిశుభ్రంగా కనిపిస్తున్నాయి.

– రమేష్, పుత్తా ఎస్టేట్స్

వంద శాతం పారిశుధ్య మెరుగునకు చర్యలు



నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేస్తున్నా. నగరంలోని అనేక ప్రాంతాలను సందర్శించా. పారిశుధ్యంపై రోజూ తెల్లవారుజామునే పర్యవేక్షిస్తున్నా. మరింత శ్రమించి వంద శాతం పారిశుధ్య మెరుగునకు చర్యలు చేపట్టి నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు యత్నిస్తా.

– వికాస్ మర్మత్, కమిషనర్

5న వలంటీర్లకు సన్మానం

నెల్లూరు(బృందావనం): ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్న వలంటీర్లను జూన్ ఐదున సత్కరించనున్నామని కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు సుబ్బారావు తెలిపారు. దీనికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను ట్రస్ట్ కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. ప్రభాకర్, మోహన్ పాల్గొన్నారు.

బాలరామాయణంపై ముగిసిన సప్తాహం

నెల్లూరు(బృందావనం): శెట్టిగుంటరోడ్డులోని వీవర్స్ కాలనీలో గల పట్టాభిరామస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న బాలరామాయణం, నామరామాయణం, అన్నమయ్య సంకీర్తనాలాపనల సప్తాహం ముగిసింది. శిరోమణిశర్మ, శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రెజ్లర్లకు మద్దతుగా దీక్ష రేపు

నెల్లూరు(అర్బన్): ఢిల్లీలో ఆందోళన చేస్తున్న రెజ్లర్లకు మద్దతుగా నర్తకి సెంటర్‌లో దీక్షను మంగళవారం చేపట్టనున్నామని కాంగ్రెస్ నేత యశోధర పేర్కొన్నారు. ఈ మేరకు నగరంలోని దుర్గా ఆస్పత్రిలో విలేకరుల సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే శేషారెడ్డి, నేతలు రఘురామ్ ముదిరాజ్, పవన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు ఎనలేనివి


వలంటీర్లను సత్కరిస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

- ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు సజావుగా అందిస్తున్న వలంటీర్ల సేవలు ఎనలేనివని ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి కొనియాడారు. 26, 27వ డివిజన్లకు సంబంధించి వేదాయపాళెంలోని ఎస్వీఎస్ కల్యాణ మండపంలో వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. వలంటీర్లను సత్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. సచివాలయ వ్యవస్థ ద్వారా అన్ని వర్గాల ప్రజల సమస్యల పరిష్కారంతో పాటు సంక్షేమ పథకాలు నేరుగా అందుతున్నాయని తెలిపారు. వచ్చే ఎన్నికల్లోనూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు ఆదరించాలని కోరారు. విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, రైల్వే బోర్డు సభ్యుడు వెంకయ్య, మన్రిపాడు జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు సుధీర్‌రెడ్డి, హరిబాబుయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు వ్యాఖ్యలు శోచనీయం



నెల్లూరు రూరల్: రాజధానిలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పంపిణీ చేసిన ఇళ్లపై టీడీపీ అధినేత చంద్రబాబు వ్యాఖ్యలు శోచనీయమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్టీ విభాగ జిల్లా అధ్యక్షుడు రవి పేర్కొన్నారు. కనుపర్తిపాడులో విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడారు. పేద, బడుగు, బలహీనవర్గాల వారిని అణిచేసే నీచ చరిత్ర చంద్రబాబుదని విమర్శించారు. సీఎం అందజేసిన ఇళ్లను తమ ప్రభుత్వం వస్తే రద్దు చేస్తామంటూ చంద్రబాబు మాట్లాడటం సమంజసంకాదని తెలిపారు. వచ్చే ఎన్నికల్లోనూ ఆయనకు ప్రజలు తగిన బుద్ధి చెప్తారన్నారు.

30న సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం


మాట్లాడుతున్న నాగేశ్వరరావు

నెల్లూరు(వేదాయపాళెం): సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలో కార్మికుల ప్రదర్శన, బహిరంగ సభను ఈ నెల 30న నిర్వహించనున్నామని నగర కార్యదర్శి నాగేశ్వరరావు పేర్కొన్నారు. బాలాజీనగర్‌లోని రామచంద్రారెడ్డి భవన్‌లో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మిక సంఘ నేతలు, కార్మికులు భారీగా తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. నేతలు శ్రీనివాసులు, ప్రసాద్, రాంబాబు, సుధాకర్, అశోక్, వేణు, తదితరులు పాల్గొన్నారు.

మహాసభల జయప్రదానికి పిలుపు



మాట్లాడుతున్న రమణయ్య

నెల్లూరు(వేదాయపాళెం): బాపట్లలో ఆగస్టులో నిర్వహించనున్న వ్యవసాయ కార్మిక సంఘ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి రమణయ్య పేర్కొన్నారు. సంతపేటలోని రామకోటయ్య భవన్‌లో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు కామేశ్వరరావు, సీపీఐ నేతలు సిరాజ్, మున్వర్, మున్నా, హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

స్క్వే క్రీడాకారులకు సర్టిఫికెట్ల అందజేత



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నిప్పో సెంటర్‌లోని స్క్వే స్పోర్ట్స్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ జిల్లా శాఖ కార్యాలయంలో క్రీడాకారులకు బెల్టులు, సర్టిఫికెట్లను ప్రముఖ నటుడు సుమన్ ఆదివారం అందజేశారు. మార్షల్ ఆర్ట్స్‌లో జాతీయ స్థాయి అవార్డును అందుకున్న అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇబ్రహీంను సత్కరించారు. అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ ఇస్మాయిల్, ప్రోగ్రామ్ ఇన్‌చార్జి ఆదినారాయణ, రషీద్, తదితరులు పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం

రాష్ట్ర స్థాయి కరాటే, స్క్వే, యోగా ఇన్విటేషనల్ చాంపియన్‌షిప్, డ్యాన్స్ పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. నగరంలోని రోటరీ క్లబ్ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో బహుమతులను నటుడు సుమన్, 25 కళాసంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి ప్రదానం చేశారు. నిర్వాహకులు రషీద్, రిషికుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మహాజన సభ నేడు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ సభ్యుల మహాజన సభను పప్పులవీధిలోని సుమంగళి కల్యాణ మండపంలో సోమవారం ఉదయం నిర్వహించనున్నామని నెల్లూరు బ్రాంచ్ మేనేజర్ టీఆర్కేవీ శర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖాతాదారులు, సభ్యులు తప్పక హాజరుకావాలని, బ్యాంక్ గుర్తింపు కార్డును తీసుకురావాలని సూచించారు.

'గోల్డ్ ఫీల్డ్స్'లో మైలేజీ పోటీలు



నెల్లూరు (టౌన్): నగరంలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్ సమీపంలో గల గోల్డ్ ఫీల్డ్స్ యమహా షోరూమ్‌లో ఫాసినో స్కూటర్‌కు మైలేజీ యాక్టివిటీ పోటీలను ఆదివారం నిర్వహించారు. పోటీలను షోరూమ్ ఎండీ హరీష్ ప్రారంభించారు. భాస్కర్ 96.55, సాల్మన్ 95.55, కాలేషా 94.89 మైలేజీని సాధించి మొదటి మూడు బహుమతులను దక్కించుకున్నారు.

ఫ్యాప్టో నేతల నిరసన

నెల్లూరు (టౌన్): ఉపాధ్యాయ పదోన్నతులను ఆన్‌లైన్లో కాకుండా మాన్యువల్‌గా చేపట్టాలని ఫ్యాప్టో చైర్మన్ సురేంద్రరెడ్డి, సెక్రటరీ జనరల్ రమేష్ కోరారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ కార్యాలయం వద్ద నిరసనను ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఆదివారం చేపట్టారు. రాష్ట్ర పరిశీలకుడు చిరంజీవి, రమణయ్య, నేతలు శేషు, ఏడుకొండలు, హజరత్, చలపతి, కరీమ్‌ఖాన్, దశయ్య, పిచ్చిబాబు, వేణుగోపాల్, ప్రసాద్, అచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు


మాట్లాడుతున్న ధనుంజయరెడ్డి

సీతారామపురం: రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డేనని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉదయగిరి నియోజకవర్గ పరిశీలకుడు మెట్టుకూరి ధనుంజయరెడ్డి పేర్కొన్నారు. సీతారామపురంలో పార్టీ కార్యకర్తలతో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్య, వైద్యంపై సీఎం ప్రత్యేక దృష్టి సారించారని చెప్పారు. నాడు – నేడుతో పాఠశాలల రూపు రేఖలే మారిపోయాయన్నారు. మాజీ జెడ్పీటీసీ సభ్యుడు దుగ్గిరెడ్డి గురవారెడ్డి, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ పీసీ అల్లూరు రాజు, రామిశెట్టి తిరుపతయ్య, పాముల రమణయ్య, తిరుపాలు, చంద్రమౌళి, రామచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

నగదు పురస్కారాల అందజేత



నెల్లూరు (టౌన్): పదో తరగతి విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను సరస్వతీనగర్‌లోని ఐఎంఏ హాల్లో ఆదివారం అందజేశారు. మున్సిపల్ పాఠశాలల్లో చదువుతూ 550కుపైగా మార్కులు సాధించిన 48 మంది విద్యార్థులకు నగదు బహుమతులను డాక్టర్ వెంకటేశ్వరరావు, సుజాతమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. జిల్లాలో అత్యధికంగా 593 మార్కులు సాధించిన గోకులకృష్ణారెడ్డికి రూ.ఏడు వేలు, 587 సాధించిన మానసకు రూ.ఆరు వేలు, 580 సాధించిన అక్షత్, పద్మరాజ్‌కు రూ.ఐదు వేల చొప్పున నగదు, జ్ఞాపికలను మేయర్ స్రవంతి, కమిషనర్ వికాస్ మర్మత్, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్ చేతుల మీదుగా అందజేశారు. 44 మంది విద్యార్థులకు రూ.నాలుగు వేల చొప్పున రైతు సంఘ నేత రాజగోపాల్, మాజీ డిప్యూటీ మేయర్ వెంకటేశ్వర్లు, వెంకటకృష్ణ, రాజేష్ ఇచ్చారు. అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు రూ.రెండు వేల చొప్పున ఉపాధ్యాయురాలు నాగవరమ్మ అందజేశారు. సుబ్బారావు, నాగేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు విజయప్రకాష్, తిరుమలరాజు, అరవింద్, శివరామ్‌ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అత్యవసర సేవలతో ప్రాణాలు కాపాడొచ్చు



నెల్లూరు(బారకాసు): అత్యవసర సమయాల్లో స్పందించడం, ట్రామా కేర్ ద్వారా ప్రాణాలను కాపాడొచ్చని ట్రాఫిక్ డీఎస్పీ అబ్దుల్ సుభాన్ పేర్కొన్నారు. వరల్డ్ ఎమర్జెన్సీ మెడిసిన్ డేను పురస్కరించుకొని అత్యవసర సమయాల్లో ఎలాంటి జాగ్రత్తలు చేపట్టాలనే అంశాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నగరంలోని వీఆర్సీ కూడలిలో మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఎమర్జెన్సీ విభాగాధిపతి కృష్ణచైతన్య, వైద్యులు బిందుశ్వేత, సాహిత్యారెడ్డి, కిరణ్, వైస్ ప్రెసిడెంట్ మహేశ్వరరెడ్డి, సెంటర్ హెడ్ గణేష్ నాగిరెడ్డి, రీజినల్ మార్కెటింగ్ హెడ్ ఉదయ్‌భాస్కర్, భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మాదిగల ఆత్మీయ సమావేశం



నెల్లూరు(వేదాయపాళెం): ఎస్సీ కమిషన్ చైర్మన్ పదవిని మాదిగలకు కేటాయించాలని సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుబ్బయ్య కోరారు. జాకీర్‌హుస్సేన్‌నగర్‌లోని ఎస్వీఆర్ స్కూల్ ఆడిటోరియంలో సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మాదిగల ఆత్మీయ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. జిల్లాల పునర్విభజన అనంతరం నెల్లూరులో ఎస్సీలకు ఒక్క నియోజకవర్గం కూడా లేదన్నారు. అన్ని వర్గాల అభ్యున్నతికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సమాన అవకాశాలను కల్పిస్తున్నారని, మాదిగలకూ తగిన ప్రాధాన్యం కల్పించాలని కోరారు. మాదిగలను చైతన్యపర్చేందుకు గానూ జిల్లాలో ఆత్మీయ సమావేశాలను నిర్వహించి భవిష్యత్తు కార్యాచరణను ప్రకటిస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనివాసులు, ఆంధ్రప్రదేశ్ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, హైకోర్టు న్యాయవాది శ్రీనివాసులు, మన ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు శ్రీనివాసులు, రవీంద్ర, వెంకట్రావు, సుబ్బారావు, విజయ్‌కుమార్, సునీత, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): కిసాన్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ పెన్నార్ ఫీడర్‌లో మైపాడు రోడ్డును వెడల్పు చేసిన ప్రాంతాల్లో విద్యుత్ లైన్లను ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో సరఫరా సోమవారం ఉండదని టౌన్ – 2 డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మధుసూదన్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జాకీర్‌హుస్సేన్‌నగర్, శ్రీనివాసనగర్, కిసాన్‌నగర్, సింహపురికాలనీ, మైపాడు గేట్ సెంటర్, తదితర ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు.




ఆదివారం వచ్చిందంటే మినీబైపాస్ రోడ్డులో సందడి నెలకొంటోంది. ప్రత్యేక వంటలను ఆరగించాలనే ఉద్దేశంతో రోడ్డు వెంబడి ఏర్పాటు చేసిన దుకాణాల వద్ద రొయ్యలు, చేపలను ప్రజలు కొనుగోలు చేస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు